# సర్కారీ పాఠశాల నుంచి కలెక్టరేట్ వరకు..

- ప్రభుత్వ ఉపాధ్యాయుడి కృషివల్లే నేను ఐఏఎస్ అయ్యాను
- విద్యతోనే విజయానికి మార్గం.. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
- గొప్పవారందరూ ఉపాధ్యాయుల చెంతే తొలి అడుగు
- విద్యా అభ్యున్నతిలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి
- ఎస్సెస్సీ పూర్తిచేసిన ప్రతి విద్యార్థి ఇంటర్మీడియట్‌లో చేరేలా చర్యలు
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 5 ప్రభాతవార్త:** నాగర్ కర్నూల్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల విద్యా ప్రమాణాల సమగ్రాభివృద్ధి దిశగా కట్టుదిట్టమైన కృషి చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ విద్యా అధికారులు, ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సమావేశం మందిరంలో మండల విద్యాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్కూల్స్ ప్రిన్సిపల్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల ప్రత్యేక అధికారులతో జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మెరుగైన వసతులు,నాణ్యమైన భోజనం, గుణాత్మక విద్య, విద్యాప్రమాణాల పెంపు, ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుండే తీసుకోవలసిన అంశాల వారిగా డీఈఓ రమేష్‌కుమార్‌తో కలిసి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ విద్య అన్నింటి కంటే శక్తి వంతమైనది, గొప్పది, చాలా ముఖ్యమైనది. ఎంత ఎత్తుకు ఎదిగినా ఉపాధ్యాయులను మరువరు. తల్లిదండ్రుల వద్ద కన్నా విద్యార్థులు ఉపాధ్యాయుల వద్దే ఎకువ సమయం గడుపుతున్నారని, సమాజం అభివృద్ధి చెందాలంటే ఉపాధ్యాయ వృత్తిపై ఆధారపడిందని అందుకు నిదర్శనమే స్వయంగా నేనే అని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ చెప్పారు. నేను ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నాను, పాఠశాలకు సరిగా వెళ్లే వాడిని కాదని ఒక ఉపాధ్యాయుడి కృషి చేయడం వల్లనే పాఠశాలకు క్రమంగా వెళ్లడం వల్లనే నేను ఇప్పుడు ఐఏఎస్ అధికారిగా అయ్యానని, ఉపాధ్యాయుడిని నేను జీవితంలో ఎప్పటికీ మర్చిపోనని, ఉపాధ్యాయులందరూ ఆ విధంగా విద్యార్థుల అభ్యున్నతికి బాటలు వేసేలా నాణ్యమైన విద్యను అందించాలని కలెక్టర్, ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థుల బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దేలా ప్రభుత్వ పాఠశాలలు ఉపాధ్యాయులు ఆ విధమైన కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా కోరారు. ప్రతి పాఠశాలలో పదో తరగతిలో ఉత్తీర్ణులైన ప్రతి ఒక్క విద్యార్థి తప్పనిసరిగా ఇంటర్మీడియట్‌లో నమోదు అయ్యేలా చూడాలని, అందుకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రతి పాఠశాలలో ఉండాలని కలెక్టర్ ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. నాగర్ కర్నూల్ జిల్లాలో గత సంవత్సరం 10,507 మంది విద్యార్థులు 10వ తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణులయ్యారని, విద్యార్థులందరూ ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించేలా తప్పనిసరిగా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. బడిబాట ద్వారా జిల్లాలో నూతనంగా నమోదుకు గుర్తించిన 12,912 మంచి విద్యార్థులను తప్పనిసరిగా సోమవారం నాటికి యుడైయిస్‌లో వారి పేర్లు నమోదు చేయాలని ఆదేశించారు. నాగర్ కర్నూల్ జిల్లాలో 23 పాఠశాలలను 5 సంవత్సరాల తర్వాత పునః ప్రారంభం చేయడం జరిగిందని, 23 పాఠశాలలను కొనసాగించి, విద్యార్థుల నమోదుశాతాన్ని పెంచాలని,జిల్లాలో ఉన్న 60 విద్యార్థులు నమోదు లేని పాఠశాలలను కూడా విద్యార్థులతో ప్రభుత్వ పాఠశాలలు పునః ప్రారంభం అయ్యేలా చూడాలని సూచించారు. వెనకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి వారికి పాఠ్యాంశాలు, తెలుగు,ఆంగ్లంలో చదవడం, రాయడం, బేసిక్స్, గణితం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.విద్యార్థులు వెనుకబడి ఉన్న పాఠ్యాంశాలపై లెర్నింగ్ వీడియోలను ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు అందించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదివే విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి, సకాలంలో తరగతులు పూర్తి చేయాలన్నారు. ఈ విద్యా సంవత్సరం పదవ తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, 10వ తరగతి విద్యార్థులపై ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఏ రమేష్ కుమార్, నోడల్ అధికారి కురుమయ్య, జిల్లా విద్యాశాఖ సెక్టోరియాల్ అధికారులు నూరుద్దీన్, శోభారాణి, మురళీధర్‌రెడ్డి, నరసింహులు, పర్యవేక్షకులు నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకులాల్లో విద్యా ప్రమాణాలు పెంచాలి

- డైట్ మెనూ ప్రకారం ఆహారం అందించాలి
- విద్యార్థుల భద్రతపై చర్యలు తీసుకోవాలి
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



గిరిజన మినీ గురుకుల పాఠశాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

**బిజినేపల్లి, జూలై5 ప్రభాతవార్త:** గురుకుల పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచాలని 100 ఉత్తీర్ణతకు కృషి చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సూచించారు. మండల కేంద్రంలోని గురుకుల సంక్షేమ పాఠశాల, గిరిజన మినీ గురుకుల పాఠశాలలను జిల్లా కలెక్టర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.గురుకుల పాఠశాలల్లో శానిటేషన్, వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని,పిల్లల భద్రతపై ప్రత్యేక చర్యలుతీసుకోవాలని పాఠశాలల ప్రిన్సిపల్‌కు సూచించారు. స్టోర్‌రూమ్‌లో నిలువ ఉంచిన ఆహార పదార్థాలు, కూరగాయలు, వంట నూనె ప్యాకెట్లు, పసుపు, కారంపొడి ప్యాకెట్లను, ఇతర సరుకులను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని ఆరా తీశారు. నాణ్యతతో కూడిన పౌష్టికాహారం అందించాలని నిర్వాహకులకు సూచించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహార పదార్థాలు వడ్డించాలన్నారు. ఆహార పదార్థాలు కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు. హాస్టల్ ఆవరణంతోపాటు వంట గదులు ఖచ్చితంగా శుభ్రంగా ఉంచాలని నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.పరిసరాల పరిశుభ్రత కోసం గ్రామపంచాయతీ అధికారులతో పనులు చేయించుకోవాలన్నారు. గురుకుల గిరిజన పాఠశాలల్లో ఎంత మంది విద్యార్థులు ఉన్నారో అడిగి తెలుసుకున్నారు. గురుకులాల్లో పాఠశాలలో ఏవైనా సమస్యలుంటే పరిశీలించి నివేదిక ఇవ్వాలని ప్రిన్సిపల్‌లను ఆదేశించారు.పాఠశాలలో చదువులు, వసతులు, సమస్యలు తదితర అంశాలను నిశితంగా కలెక్టర్ పరిశీలించారు. వర్షాకాలం అయినందున విద్యార్థులకు విష జ్వరాలు ప్రబలకుండా సరైన శానిటేషన్ పాటించాలని ప్రిన్సిపాల్ కు సూచించారు. ఆహార పదార్థాలు కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు. గిరిజన గురుకుల –మిగతా4లో..

మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల్ /నారాయణపేట

## గత ప్రభుత్వంలో మార్కెట్ యార్డులు నిర్వీర్యం

- కాంగ్రెస్ ప్రభుత్వంలో మారిన మార్కెట్ యార్డ్ రూపు రేఖలు
- రైతులకు సేవ చేసే భాగ్యం నా అదృష్టం
- మార్కెట్ పాలకవర్గం వార్షికోత్సవ వేడుకల్లో చైర్మన్ బండారు శ్రీనివాస్ గౌడ్



మాట్లాడుతున్న చైర్మన్ బండారు శ్రీనివాస్ గౌడ్

**వనపర్తి ప్రతినిధి, జూలై 5 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు మార్కెట్ యార్డుల రూపు రేఖలు మారాయని, రెండోసారి రైతులకు సేవ చేసే భాగ్యం నా అదృష్టం అని వనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం వనపర్తి మార్కెట్ యార్డు పాలకవర్గం వార్షికోత్సవ సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు మార్కెట్‌యార్డ్ పాలకవర్గ సభ్యులను రైతులు. మార్కెట్ యార్డ్ వ్యాపారస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గత టిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మార్కెట్ యార్డులు నిర్వీర్యం అయ్యాయని గుర్తు చేశారు.రైతు సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికి రైతుల కోసం 80,000 కోట్ల రూపాయలను రుణమాఫీ. రైతుభరోసా. వరి ధాన్యం కొనుగోలు. ఇతర అవసరాలకు ఖర్చు పెట్టిన ఏకైక ప్రభుత్వంగాకాంగ్రెస్ చరిత్రలో మిగిలిందని వివరించారు. వనపర్తి మార్కెట్ యార్డ్ కమిటీ ఏర్పడి సంవత్సరకాలం పూర్తవుతున్న సందర్భంగా ఈ వార్షికోత్సవమని జరుపుకోవడం అభినందనీయమని అన్నారు.వనపర్తి పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డుల్లో ఉన్న షాపులకు విద్యుత్ సరఫరా కోసం ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటుతోపాటు విద్యుత్ మీటర్లను బిగించడం జరిగిందని తెలిపారు. ప్రతి ఒక్కరు గతంలో వనపర్తి మార్కెట్‌కు ధాన్యం తరలించడం వల్ల అనేక సమస్యలు ఇబ్బందులు కష్టాలు నష్టాలు భరిస్తున్న రైతులను గమనించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రత్యేకంగా ఎక్కడికక్కడ మార్కెట్ యార్డులను ఏర్పాటు చేసి రైతులకు చేతోడు వాదోడుగా ఆయన కృషి చేశారని అన్నారు. అంతేకాక కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పుష్కలంగా వర్షాలు రావడం చెరువు, కుంటలు, రిజర్వాయర్లు కళకళలాడుతూ రైతులు అధిక మొత్తంలో పంటలు పండిస్తున్నారని రికార్డ్ స్థాయిలో ధాన్యం మార్కెట్ యార్డులో ఎప్పుడు లేని విధంగా ఈసారి కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం మార్కెట్ యార్డ్ చైర్మన్ గా తాను శక్తి వచ్చిన లేకున్న కృషి రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తూ రైతులు పండించిన పంటకు బాధ్యత భరోసా కల్పిస్తూ మార్కెట్ యార్డులో తగిన వసతులతో పాటు గిట్టుబాటు ధర. వరి ధాన్యానికి బోనస్ చెల్లించడం ధాన్యము కొనుగోలు కేంద్రాలపైన ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, పాలకవర్గ సభ్యులు కొత్త గొల్ల కృష్ణయ్య, చీపుర్ల శ్యాంసుందర్ రెడ్డి, రాములు నాయక్, గోపాల్ నాయక్, ఉమేష్ కుమార్, సురేష్,ఆగు పోగులలతీఫ్ హుద్దీన్, బండారు రాజేందర్, సదుర్ల శారదతోపాటు వనపర్తి మాజీ జడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు బి. కృష్ణ. కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త లక్కాకుల సతీష్, దళిత నాయకుడు వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు ధనలక్ష్మి, ఎస్ఎల్ ఎన్.రమేష్. యాపర్ల రాంరెడ్డి, మాజీ కౌన్సిలర్ బ్రహ్మం, కాంగ్రెస్ యువ నాయకుడు రాహుల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అచ్యుతాపురం తిరుపతయ్య, రైతులు వ్యాపారస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మెనూ ప్రకారం వడ్డించాలి

- అధికారులు ప్రత్యేక నిఘా ఉంచాలి
- గురుకుల కళాశాలల్లో తనిఖీలు నిర్వహించిన కలెక్టర్



గురుకులాల్లో వసతులను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 5 ప్రభాతవార్త:** జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి శనివారం జిల్లా కేంద్రంలోని గురుకుల కళాశాలలను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న విద్యా, మౌలిక సదుపాయాల పరిరక్షణపై ప్రత్యేక దృష్టితో ఈ తనిఖీలు చేపట్టారు. అప్పన్నపల్లిలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలను, పిల్లల మర్రిలోని సాంఘిక సంక్షేమ గురుకులమహిళా డిగ్రీ కళాశాలలను సందర్శించి తరగతుల గదుల్లో విద్యార్థులు చదువుతున్న తీరును, మౌలిక వసతులను పరిశీలించారు. అలాగే డార్మెటరీలు, టాయిలెట్లు తదితర వసతులపై ఆరా తీశారు. అవసరమైన అభివృద్ధి పనులపై అక్కడి సిబ్బందికి సూచనలు చేశారు. గిరిజన మహిళ శిశు సంక్షేమ శాఖలో హాస్టల్ రూంలలో డార్మెటరీ కిటికీలకు మెష్ ఏర్పాటు చేయాలని, డోర్‌లు,కిటికీలు రిపేర్లు చేపట్టాలని సూచించారు. విద్యార్థినులకు సరిపడా డబుల్ కాట్ బెడ్‌లు, లేవని ప్రిన్సిపాల్ తెలిపారు. బాత్రూంలలో గాలి వెళ్లేందుకు ఎగ్జాస్ట్ ఫ్యాన్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. కిచెన్ రూం పరిశీలించారు. కూరగాయలు తాజాగా తీసుకొని వండించాలని సూచించారు. పిల్లల మర్రిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ మహిళా డిగ్రీ కళాశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న వసతులు, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై సమీక్ష జరిపారు. ఈ తనిఖీల నేపథ్యంలో, జిల్లా కలెక్టర్ విద్యార్థుల భద్రత, అభ్యాసం, మౌలిక వసతుల మెరుగుదల కోసం అధికారులు నిరంతరం నిఘా ఉంచాలని, అవసరమైన చర్యలు వేగంగా చేపట్టాలని సూచించారు. మెనూ ప్రకారం ఆహారం అందించాలని సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి జనార్ధన్, కలశాలల ప్రిన్సిపాల్ లు ఉన్నారు.

## కాంట్రాక్టర్లను ఉద్దేశించే మాట్లాడా..

- చంద్రబాబు కోవర్టులని వాళ్లనే అన్నాను
- నా మాటలను వక్రీకరిస్తే సహించేది లేదు
- ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి వార్నింగ్

**జడ్చర్ల, జూలై 5 ప్రభాతవార్త:** బనకచర్ల ప్రాజెక్టు విషయంలో చంద్రబాబు నాయుడు కోవర్ట్‌లు తెలంగాణలో ఉన్నారని తాను చేసిన వాఖ్యలు కేవలం కాంట్రాక్టర్లను ఉద్దేశించి మాత్రమే తాను చెప్పానని, నాయకులను గురించి తాను ఎలాంటి కామెంట్స్ చేయలేదని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంగా తనకు సంబంధించిన వీడియోను చూడకుండానే కొందరు విపక్ష నేతలు తాను నాయకుల ఉద్దేశించి కోవర్టులంటూ మాట్లాడానని తప్పుడు ప్రచారం చేయడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో చంద్రబాబు నాయుడుకి సంబంధించినటువంటి వ్యక్తులు కాంట్రాక్టర్లుగా పని చేస్తున్నారని, వారు ఇరిగేషన్ ప్రాజెక్టులు, పెద్ద రోడ్డు కాంట్రాక్టర్లు, హైదరాబాదులో దండాలు చేస్తున్నారని వారిని టైట్ చేస్తే వారే వెళ్లి చంద్రబాబునాయుడి కాళ్లు పట్టుకొని బనకచర్ల ప్రాజెక్టు ఆపుతారని మాత్రమే తాను చెప్పానని, ఇంకా కూడా తాను ఏ నాయకుడు గురించి మాట్లాడలేదని ఈ సందర్భంగా అనిరుధ్‌రెడ్డి చెప్పారు. మీడియాకు శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో అనిరుధ్ రెడ్డి తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. అయితే కేటీఆర్‌తో సహా కొంతమంది విపక్ష నాయకులు తాను చేసిన వ్యాఖ్యలను వక్రీకరిస్తూ చంద్రబాబు నాయుడు కోవర్ట్ అని తాను సీఎం రేవంత్ రెడ్డిని పరోక్షంగా వ్యాఖ్యానించినట్లు చెప్పడం పట్ల ఆయన ఆక్షేపణ తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి టిడిపి నుంచి వచ్చిన కారణంగా చంద్రబాబు నాయుడు కోవర్ట్ అయితే బిఆర్ఎస్ అధినేత కేసిఆర్ కూడా టిడిపి నుంచి వచ్చారనే విషయాన్ని గుర్తు గుర్తుపెట్టుకోవాలని మరి ఆయనను కూడా చంద్రబాబు నాయుడు కోవర్టుగా పరిగణించాలా అని ప్రశ్నించారు. ఈ విషయంగా తాను చేసిన వీడియోను చూసి ఆతర్వాతే దాని గురించి మాట్లాడాలని తన వీడియోను చూడకుండా మాట్లాడం సబబు కాదని ఆయన హితవు చెప్పారు. తాను కేవలం కాంట్రాక్టర్ల గురించే మాట్లాడానని చంద్రబాబు కోవర్టులని వాళ్లని మాత్రమే అన్నానని నాయకుల గురించి ఎక్కడ మాట్లాడలేదని అనిరుధ్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ వివాదంలో సీఎంను లాగకండి అని ఆయన కోరారు. ఈ వీడియోను చూడకుండాతప్పుడు వ్యాఖ్యానాలను చేస్తేసహించేదే లేదని అనిరుధ్‌రెడ్డి హెచ్చరించారు.

## ఆయిల్ ఫామ్ లక్ష్యాన్ని సాధించే దిశగా చర్యలు చేపట్టాలి

- జిల్లాకు 3500 ఎకరాలకు నిర్దేశించిన ఇప్పటి వరకు 54 ఎకరాలే సాగు
- రైతులకు ఆయిల్ ఫామ్ తోటల సాగుతో వచ్చే లాభాల గురించి అవగాహన కల్పించాలి
- నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



మాట్లాడుతున్న నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట ప్రతినిధి, జూలై 5 ప్రభాతవార్త:** జిల్లాకు 2025,26 ఆర్థిక సంవత్సరానికి గాను ఆయిల్ ఫామ్ సాగు కోసం నిర్దేశించిన 3500 ఎకరాల లక్ష్యాన్ని ఉద్యాన శాఖ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు సమన్వయంతో రైతులను గుర్తించి లక్ష్యసాధనకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఉద్యాన శాఖ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయిల్ ఫామ్ సాగుపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు నిర్దేశించిన 3500 ఎకరాలకు ఇప్పటి వరకు 54 ఎకరాలలో ఆయిల్ ఫామ్ తోటలను నాటడం జరిగిందని తెలిపారు. ఆయిల్ ఫామ్ తోటల సాగుపై రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తే రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు ఆమె తెలిపారు. నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించేందుకు వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులను గుర్తించడంతోపాటు వారికి ఆయిల్ ఫామ్ తోటల సాగుతో వచ్చే లాభాల గురించి అవగాహన కల్పించాలని ఆమెసూచించారు. ఒక్కో మండల వ్యవసాయ అధికారికి 50 ఎకరాల టార్గెట్‌ను కలెక్టర్ నిర్దేశించారు. ఉద్యాన శాఖ పథకం అనుసంధానంతో మొక్కల సరఫరా, మొదటి 4 సంవత్సరాల అంతా పంటలకు, రసాయన ఎరువులకు సబ్సిడీ ఉంటుందని ఆమె చెప్పారు. వ్యవసాయ శాఖ ఉద్యానశాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి వారానికి మూడు రోజుల చొప్పున రైతు వేదికలలో సమావేశాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుంచి మొక్కలు, డ్రిప్ కొరకు రైతు వాటా డీడీ కట్టించి జిల్లాకు కేటాయించిన ఆయిల్ ఫామ్ తోటల సాగు లక్ష్యాన్ని వంద శాతం పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ సంయుక్త సంచాలకులు రామలక్ష్మి, రాష్ట్ర ఆయిల్ ఫెడ్ నుండి ప్రత్యేక అధికారి సత్యనారాయణ, జిల్లా ఉద్యానవన, పట్టు పురుగుల పెంపకం అధికారి సాయి బాబా, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్, వ్యవసాయ శాఖ డీడీ రాజరత్నం,అన్ని మండల వ్యవసాయ అధికారులు, ఉద్యానవన అధికారులు, విస్తరణ అధికారులు, ఆయిల్‌ఫెడ్ సిబ్బంది పాల్గొన్నారు.

## బీఎల్‌ఓల పాత్ర ఎంతో కీలకం

- వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి




బిఎల్‌ఓల శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్

**వనపర్తి ప్రతినిధి, జూలై 5 ప్రభాతవార్త:** ఎన్నికల ప్రక్రియలో బూత్ స్థాయి అధికారుల(బీఎల్వో) పాత్ర ఎంతో కీలకమని, బిఎల్ఓలందరూ ఫామ్ 6, 7, 8 లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్‌సురభి అన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బిఎల్‌ఓలకు జులై 3వ తేదీ నుండి జులై 10వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో బిఎల్‌ఓలకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హాజరై మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియలో బూత్ స్థాయి అధికారుల (బీఎల్‌ఓ) పాత్ర ఎంతో కీలకమని, బిఎల్‌ఓలందరూ ఫామ్ 6,7,8లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ప్రతి ఒక్క బిఎల్‌ఓ తమ వద్ద ఎలక్టరల్ రోల్ కలిగి ఉండాలని సూచించారు. ప్రతి బిఎల్‌ఓ తమ పరిధిలోని ఓట్లలో డూప్లికేట్ ఓట్లు ఏమైనా ఉంటే తొలగించాలని, అదేవిధంగా కొత్త ఓటర్లను ఫామ్ 6 ద్వారా ఎన్‌రోల్ చేయాలని సూచించారు. ఎవరైనా వ్యక్తులు చనిపోతే వారి ఓట్లను కూడా గుర్తించి తొలగించాలని సూచించారు. ఎవరైనా ఫామ్ 6 ద్వారా కొత్తగా ఓటు హక్కు కోసం నమోదు చేసుకుంటే, వారికి గతంలో ఎక్కడైనా ఓటు ఉంటే ఫాం 6 అనుమతించవద్దని చెప్పారు. ఓటర్ అప్లికేషన్లను స్వతహాగా ఆన్‌లైన్ చేసే ప్రక్రియను బిఎల్‌ఓలు నేర్చుకోవాలన్నారు.ఈ అంశాలకు సంబంధించి ఏమైనా అనుమానాలు ఉంటే ఇక్కడే శిక్షణ కార్యక్రమంలో నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ బిఎల్‌ఓలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, తహసిల్దార్ రమేష్‌రెడ్డి,శిక్షణ అధికారులు, ఇతర ఎన్నికల అధికారులు, తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## గ్రౌండింగ్ ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలి

**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా నిరంతర పర్యవేక్షణ జరపాలి : జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్

**వనపర్తి, జూలై 5 ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి రెండవ దశలో పథకానికి ఎంపికై మంజూరు పత్రాలు పొందిన లబ్ధిదారులు వేగంగా గ్రౌండింగ్ ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శనివారం కలెక్టర్ తన ఛాంబర్‌లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతికి సంబంధించి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థల యాదయ్యతో కలిసి హౌసింగ్ అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలలో స్పష్టమైన ప్రగతి కనిపించేలా అధికారులు క్షేత్రస్థాయిలో కృషి చేయాలన్నారు. ఇందిరమ్మ ఇంటిని ఎంత త్వరగా పూర్తి చేస్తే అంతే త్వరగా బిల్లులు రావడం జరుగుతుందని లబ్ధిదారులకు తెలియజేయాలన్నారు. లక్ష్యానికి అనుగుణంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా నిరంతర పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ అధికారులను సూచించారు. ఒక్కో మండలం వారీగాకేటాయించిన లక్ష్యం, లబ్ధిదారుల నిర్ధారణ, మంజూరీలు తెలిపిన వాటిలో ఎన్ని ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం అయ్యాయి, అవి ఏ దశలో ఉన్నాయి. క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని కలెక్టర్ అధికారులను ఆరాతీశారు. లబ్ధిదారులకు గృహ నిర్మాణం కొరకు మన ఇసుక వాహనం ద్వారా ఉచితంగా –మిగతా4లో..

## భూత్పూర్ రిజర్వాయర్ ద్వారా సాగు,తాగునీటి విడుదల



నీటిని విడుదల చేస్తున్న అధికారులు

**మక్తల్ టౌన్, జూలై5 ప్రభాతవార్త:** మక్తల్ మండలములోని భూత్పూర్ రిజర్వాయర్ నుండి రాష్ట్ర మంత్రి వర్యులు మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు ఎగువన కురుస్తున్న వర్షాలకు కృష్ణానదికి భారీ ఎత్తున వరద వస్తున్న సందర్భంగా మక్తల్ నియోజక వర్గంలోని రైతులకు వర్షాకాలం పంటలకు తాగు,సాగు నీటిని ఎడమ,కుడి కాలువల ద్వారా ఇరిగేషన్ అధికారులు సతీష్ కుమార్ నీరు విడుదల చేశారు. నియోజకవర్గ ముఖ్య నాయకులు మార్కెట్ కమిటీ చైర్మేన్ రాధా లక్ష్మారెడ్డి, వైస్ చైర్మన్ గణేష్ కుమార్, కట్ట సురేష్, కృష్ణయ్య గౌడ్, బిల్డర్ తాయప్ప, రామ్‌రెడ్డి, నాగిరెడ్డి, రాములు, నారాయణ, కె.చెన్నయ్య గౌడ్, జనార్దన్ గౌడ్, బొంబాయి నరసింహ, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## పర్యావరణాన్ని పరిరక్షిద్దాం!

**వెల్దండ, జూలై5 ప్రభాతవార్త:** మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దామని ఏపీవో ఈశ్వర్ జీ అన్నారు. వెల్దండ మండలం లోని రాచూరు గ్రామంలో వన మహోత్సవంలో భాగంగా శని వారం మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఈశ్వర్ జీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా నర్సరీలో పెంచుతున్న మొక్కలను సంరక్షించి వాటిని పెంచి వర్షకాలం దృష్ట్య మొక్కలు నాటడం జరుగుతుందని, నాటిన ప్రతి మొక్క లను సంరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది కూలీలు తదితరులు ఉన్నారు.

# వర్షాకాలంలో ప్రకృతి విపత్తులు తలెత్తకుండా చూసుకోవాలి

### మండల ప్రకృతి విపత్తుల కమిటీ చైర్మన్, తహసీల్దారు వీరభద్రప్ప



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్,తహసీల్దార్ వీరభద్రప్ప

**ఇటిక్యాల, జూలై5 ప్రభాతవార్త:** 3 నెలల పాటు వర్షాకాలం నేపథ్యంలో మండల పరిధిలోని 14 గ్రామపంచాయతీలలో భారీ వర్షాలు కురిసిన సమయంలో గ్రామపంచాయతీలో గల అన్ని శాఖల అధికారులు బాధ్యతాయుతంగా పని చేస్తూ అప్రమత్తంగా ఉంటూ ప్రజలను ప్రభుత్వం చేయాలని ఎలాంటి ప్రాణ నష్టం. ఆస్తి నష్టం, పంట నష్టం జరగకుండా ముందస్తు ప్రణాళిక ఉండాలని మండల ప్రకృతి విపత్తుల కమిటీ చైర్మన్ తాహసిల్దారు వీరభద్రప్ప అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్ ఆదేశాల మేరకు మండలపరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో మండల స్థాయి అధికారులు గ్రామపంచాయతీ కార్యదర్శులు.గ్రామాల వ్యవసాయ విస్తరణ అధికారులు. వైద్య సిబ్బంది. పోలీస్‌శాఖ పంచాయతీరాజ్, నీటి పారుదల శాఖకు సంబంధించిన అధికారులతో మండల ప్రకృతి విపత్తుల కమిటీ సమా వేశం తాహసిల్దార్ వీరభద్రప్ప ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ వర్షాకాల సమయంలో ప్రకృతి ప్రకృతి విపత్తులు తలెత్తకుండా అధికారులు ప్రజలు అప్రమత్తం కావాలని అలాగే గ్రామాలలో భారీ వర్షాల కురిసిన నేపథ్యంలో వరదల కారణంగా కల్వర్టులు, చెరువులు, నీటి కుంటలు, వాగులలో వరద నీరు ఉధృతిగా ప్రవహించే అవకాశం ఉంటుందని అందుకు అధికారులు ఎలాంటి ఘటనలు జరగకుండా చూసుకోవాలని అలాగే శిథిలావస్థకు చేరుకున్న ఇండ్లలో నివసిస్తున్న వారిని ప్రభుత్వ భవనాలు అలాగే ప్రభుత్వ పాఠశాలలలో వారికి ఆశ్రయం కల్పించాలని గ్రామాల రహదారుల వెంట ఉన్న కల్వర్టులు. వరదల సమయంలో ఉధృత్తిగా వరద నీరు పారుతున్న సమయంలో ప్రజలను వాటిపై ప్రయాణించకుండా చూడాలని అలాగే విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని వర్షాకాల సమయంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉంటూ ప్రజలను కూడా అప్రమత్తంగా ఉంచాలని అదేవిధంగా వర్షాలు కురిసిన సమయంలో రోడ్లు, డ్రైనేజీలు అపరిశుభ్రంగా మారుతాయని వాటి ద్వారా ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందని అందుకు వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు గ్రామాలలో జ్వర సర్వేలు నిర్వహించి మందులను పంపిణీ చేయాలని ఆదేశించారు. ప్రధానంగా సాతర్ల,ఉదండాపురం, చాగాపురం, ఇటిక్యాల, గ్రామాల రహదారుల మధ్యలో ఉన్న కల్వర్టులు, బ్రిడ్జిలు అలాగే పెద్దదిన్నె ఇటిక్యాల రైల్వే ట్రాకు కింద నిర్మించిన అండర్ బ్రిడ్జిల లో కూడా వరద నీరు ఆగి ఉంటుందని అందులో ప్రయాణించకుండా అధికార యంత్రాంగం వారిని ఆ ప్రభుత్వం చేయాలని సూచించారు. ప్రకృతి విపత్తుల మండల కమిటీ నెలలో 2 సార్లు సమావేశం కావడం జరుగుతుందని గ్రామాలలో ఉన్న సమస్యలను పంచాయతీ కార్యదర్శులు ఆయా శాఖల అధికారులు అధికారుల దృష్టికి తీసుకు రావాలని తహసిల్దార్ సూచించారు.ఈ సందర్భంగా ఎస్సై వెంకటేష్ మాట్లాడుతూ.. వర్షాకాలం నేపథ్యంలో భారీ కృషి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంటుండగా ఇటిక్యాల. ఉదండాపురం. సాతర్ల. చాగాపురం గ్రామాల మధ్యలో ఉన్న కల్వర్టులు.బ్రిడ్జిలలో కూడా వరద నీరు ఉధృతంగా పారే అవకాశం ఉంటుందని ఆ సమయంలో ప్రయాణికులు వరద ఉధృతి తగ్గేదాకా వేచి ఉండాలని గత ఏడాదిలో సాతర్ల గ్రామ సమీపంలో ఉన్న బ్రిడ్జి కింద వరద ఉధృతి కారణంగా చాలా ఇబ్బందులు వచ్చాయని అందుకు వర్షాకాలంలో ప్రజలంతా అప్రమత్తంగాఉంటూ రోడ్లపై ప్రయాణించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీడీవో. ఎంఈఓ. వర్షాకాలం నేర్పత్యంలో ప్రకృతి విపత్తులు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల పై మాట్లాడారు.అలాగే పలు గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు సమస్యలను వివరించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాహసిల్దార్ నందిని, ఎంపీడీవో మహమ్మద్ అజార్ మొహిద్దీన్, ఎంఈఓ వెంకటేశ్వర్లు, ఎస్సై వెంకటేష్, ఆర్ఐలు మనోహర్, మదన్ మోహన్, వైద్య సిబ్బంది పంచాయతీరాజ్ ఏఈ భరత్ కుమార్‌రెడ్డి. నీటిపారుదల శాఖ ఏఈ సాయి చందు, పంచాయతీ కార్యదర్శులు, ఏఈవోలు పాల్గొన్నారు.

# నేడే తొలి ఏకాదశి

**నర్వ, జూలై 5 ప్రభాతవార్త :** ఏడాది పొడుగునా ఉండే 24 ఏకాదశుల్లో, ఆషాఢ శుక్ల ఏకాదశిని తొలి ఏకాదశిగా పరిగణిస్తారు.పూర్వకాలంలో ఈ రోజును సంవత్సరారంభంగా పరిగణించేవారు. ఉత్తరాయణం కన్నా దక్షిణాయనంలో పండుగలూ పబ్బాలూ ఎక్కువ.లంఖణం పరమ ఔషధం అనే ఉపవాస దీక్షకు నాంది తొలి ఏకాదశి.విష్ణుమూర్తి పాలకడలిపై యోగనిద్రలోకి వెళ్ళే సందర్భాన్ని తొలిఏకాదశిగా పరిగణిస్తారు.స్వామి నిద్రించే రోజు కాబట్టి దీనిని శయన ఏకాదశి అని కూడా అంటారు.సతీ సక్కుబాయి ఈనాడే మోక్ష ప్రాప్తి పొందింది.తొలిఏకాదశి నాడు రోజంతా ఉపవాసం ఉండి,రాత్రికి జాగారం చేసి,మర్నాడు ద్వాదశినాటి ఉదయం విష్ణుమూర్తిని పూజించి తీర్థప్రసాదాలను స్వీకరించి ఆ తర్వాత భోజనం చేస్తే జన్మజన్మల పాపాలు ప్రక్షాళనమవుతాయని భక్తుల నమ్మకం.ఆ రోజు యోగనిద్రకు ఉపక్రమించే విష్ణువు మళ్ళీ నాలుగు నెలల తర్వాత కార్తీక శుద్ధ ఏకాదశి నాడు మేల్కొంటాడంటారు.ఈ ఏకాదశిని పద్మఏకాదశిగా కూడా పిలుస్తారు.ఈ యోగ నిద్ర సమయంలో భూమిపై రాత్రి సమయాలు పెరుగుతాయన్నది ఓ సూచన. తద్వారా ప్రజలలో నిద్రా సమయాలు పెరుగుతాయి. భవిష్యోత్తరపురాణంలో కృష్ణుడు ధర్మరాజుకు ఈ ఏకాదశి మహత్యం వివరించాడని ఉంది.దానిని ఉత్థాన ఏకాదశి అంటారు.ఆ తర్వాత రోజు వచ్చే ద్వాదశినే క్షీరాబ్ది ద్వాదశి అంటారు.ఈ నాలుగు నెలల కాలాన్నీ పవిత్రంగా పరిగణించి అందరూ చాతుర్మాస్యదీక్ష చేస్తారు. తాళజంఘుడు అనే రాక్షసుని కుమారుడగు మురాసురునితో యుద్ధంలో గెలవలేక అలసిపోయిన విష్ణువు,తన శరీరం నుంచి జనింపజేసిన కన్యకనే ఏకాదశి అంటారు. ఏకాదశీ వ్రతాన్ని ఆచరించే రుక్మాంగదుడు మోహిని రూపంలో వచ్చి ఏకాదశిపూట పొందుకోరిన రంభను తిరస్కరించాడట.చతుర్మాస్యదీక్ష చేపట్టినవారు నాలుగునెలలపాటు ప్రయాణాలు చేయరు. కామక్రోధాదులను విసర్జిస్తారు. ఆహారం విషయంలో కొన్ని నిషేధాలు పాటిస్తారు.జొన్న పేలాలు బెల్లం కలిపి దంచి పిండి చేస్తారు.రైతులు ఈరోజున కచ్చితంగా పేలపిండి తింటారు. ఏకాదశినాడు ఉపవాస నియమం లోకంలో స్థిరపడింది. ఈ ఏకాదశి ప్రజలలో ఉండే చైతన్యానికి ప్రతీక.ఏకాదశి అంటే పదకొండు.అయిదు జ్ఞానేంద్రియాలు,అయిదు కర్మేంద్రియాలు,మనస్సు కలిపి మొత్తం పదకొండు.వీటిని మనిషి తన అధీనంలోకి తీసుకువచ్చి వాటినన్నటినీ ఒకటిగా చేసి,అప్పుడు దేవునికి నివేదన చేయాలి. దీనివలన మనిషికి సహజంగా అలవడే బద్ధకం దూరమవుతుందని,రోగాలు దరిచేరకుండా ఉంటాయని, ఇంద్రియ నిగ్రహం పెరుగుతుందని ఒక నమ్మకం.పురాణ నేపథ్యం ధర్మము తప్పని,సత్యసంధుడు అయిన రాజు మాంధాత.అతని రాజ్యంలో ఒకసారి తీవ్ర కరువు వచ్చింది.దానితో ప్రజలు పడరాని పాట్లు పడుతుంటే అంగీరసుడు సూచనపై ఈ శయనైక ఏకాదశి వ్రతాన్ని భక్తితో చేస్తాడు,దానితో వర్షం వచ్చి కరువు తీరి ప్రజలు సుఖంగా వున్నారని పురాణాలు చెపుతున్నాయి. అయితే,విష్ణుమూర్తి యోగనిద్రలోకి వెళతాడని పెద్దలు చెప్పగానే,నిజంగానే దేవుడు నిద్రపోతాడా అని ఒక సందేహం కలుగుతుంది.విష్ణువు అంటే సర్వవ్యాపి అని అర్థం. అంటే విష్ణువు అనే పదానికి అంతర్లీనంగా సూర్యుడు అని అర్థం అన్నమాట.ఇప్పటివరకు ఉత్తర దిక్కుగా ప్రయాణించిన సూర్యుడు,ఈ రోజు నుంచి దక్షిణదిక్కుకు వాలుతాడు.అంటే ఈ రోజు మొదలుగా దక్షిణ దిక్కుగా ప్రయాణిస్తాడు. దానినే సాధారణ పరిభాషలో నిద్రపోవడం అని అభివర్ణించారు. సాక్షాత్తు భగవంతుడే నిద్రిస్తుంటే ఈ పూజలుఎవరికి చేయాలిఅనుకోవచ్చు.ఈ నెలలోనే ప్రకృతిలో,పర్యావరణంలో మార్పులు వస్తాయి. తద్వారా మన శరీరానికి జడత్వం వచ్చి, అనేక రోగాలు చుట్టుముడతాయి.ఉపవాసం వల్ల జీర్ణకోశం పరిశుద్ధమై, దేహం నూతనోత్తేజాన్ని సంతరించుకుంటుంది. ఇంద్రియనిగ్రహాన్ని కలిగిస్తుంది. ఇంతేకాక కష్టపరిస్థితుల్లోను, భయంకరమైన రోగాలు వచ్చినప్పుడు విపరీతమైన పరిస్థితులను ఎదుర్కోవడం కోసమే ఈ కఠిన ఉపవాసాలు, ఆచారాలు ఏర్పడ్డాయి. ఇందువలన కామక్రోధాదులను విసర్జించగలుగుతారు. ఆహారం విషయంలో కొన్ని నిషేధాలు పాటిస్తారు. అలా ఏకాదశినాడు ఉపవాస నియమం లోకంలో స్థిరపడింది.

## జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ దరఖాస్తులకు ఆహ్వానం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 5 ప్రభాతవార్త:** జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు 2025 సంవత్సరానికి అర్హత గల ఉపాధ్యాయులు దరఖాస్తులు చేసుకోవాలని నాగర్ కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.రమేష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు గా పనిచేస్తూ 10 సంవత్సరాల సర్వీసు పూర్తి అయిన ఆసక్తి గల ఉపాధ్యాయులు ప్రభుత్వ వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 13వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాల కోసం జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్ రావు 63025 38858ను సంప్రదించొచ్చు లేదా వెబ్‌సైట్ ద్వారా చూసుకోవచ్చని, రిజిస్ట్రేషన్ చేసిన కాపీని డీఈఓ కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు.

## మున్సిపల్ సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు




మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్న దృశ్యం

**పెబ్బేరు, జూలై 5 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వ ఆదేశముల మేరకు చేపట్టిన 100 రోజుల కార్యక్రమలలో భాగంగా శనివారం పెబ్బేరు మున్సిపాలిటీలోని శ్రీ సరోజినీ హాస్పిటల్ వారు మున్సిపల్ స్టాఫ్ అందరికీ ఉచిత హెల్త్ క్యాంప్‌ని నిర్వచించడం జరిగినది. పట్టణ పరిశుభ్రతలో సానిటేషన్ చాలా ముఖ్యమని అలాగే సానిటేషన్ కార్మికుల హెల్త్ చాలా ముఖ్యం. ఇట్టి ఉచిత వైద్య శిబిరాన్ని మున్సిపల్ స్టాఫ్ అందరూ కూడా సద్వినియోగ పరుచుకోవాలని తెలుపుతూ, కార్యక్రమానికి సహకరించిన హాస్పిటల్ యాజమాన్యానికి మున్సిపల్ కమిషనర్ ఖాజా అరీఫుద్దీన్ కృతజ్ఞులు తెలియజేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌ని సన్మానించి, డా. భరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ హాస్పిటల్ ప్రారంభించినప్పటి నుండి మున్సిపల్ సిబ్బంది సహకారం మరవలేనిదని,అందుకుఎంతో కొంత ఉపయోగపడాలని ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లుగా తెలిపారు. క్యాంప్‌లో ఈఇజి, 2డి ఈసిహెచ్‌ఓ, ఆర్‌బిఎస్ (షుగర్ టెస్టు), బిపి, సిబిపి (బ్లడ్ ప్రొఫైల్) వంటి టెస్టులు చేసినట్లు గా తెలియజేశారు. కార్యక్రమంలో డా. ఉమేష్ నాయక్, జనరల్ ఫిజీషియన్, డా. అనిరుధ్ కార్డియాలజిస్ట్, మున్సిపల్ మేనేజర్ గణేష్ బాబు, జూనియర్ అసిస్టెంట్‌లు,వార్డ్ ఆఫీసర్‌లు,మున్సిపల్ సిబ్బంది మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

## వికలాంగుల సమస్యలు తీర్చాలని వినతి

**ధన్వాడ, జూలై 5 ప్రభాతవార్త :** వికలాంగుల సమస్యలను వెంటానే తీర్చాలని కోరుతు శనివారం ధన్వాడ మండల వికలాంగుల సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ సింధుజకు వినతిపత్రం అందించారు. చేయూత పించన్ల కోసం వికలాంగులు దరఖాస్తులు చేసుకొన్నప్పటికి ఇప్పటికి మంజూరు చేయలేదన్నారు. అదేవిధంగా వికలాంగు కార్పొరేషన్ బలోపేతం కోసం చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వికలాంగుల సంఘం అధ్యక్షుడు కెంచె రంగయ్య, కుమ్మరి కుర్మన్న, కెంచె వెంకటేష్, బాలచందర్, పెంటయ్యతో పాటుగా పలువురు పాల్గొన్నారు.



# జిల్లా అభివృద్ధిలో నేనూ భాగస్వామినవుతా..

■ తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్, ప్రొఫెసర్ ఉంద్యాల బాలకిష్టరెడ్డి



మాట్లాడుతున్న బాలకిష్ట రెడ్డి

**జడ్చర్ల, జూలై 5 పభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఉంద్యాల బలకిష్టా రెడ్డి శనివారం స్థానిక డా. బూర్గుల రామకృష్ణ రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించారు.ఈ సందర్భంగా కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ డా.డి.నర్మద మొక్కతో స్వాగతంపలికారు. మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఓరియెంటేషన్ కార్యక్రమంలో విద్యార్థులనుద్దేశించి ఆయన ప్రసంగించారు. డిగ్రీ చదువుతో ఉన్నత ఉద్యోగాలు అనేకం ఉన్నాయని కాకపోతే విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. దేశంలో అనేక రంగాలలో ఉద్యోగ అవకాశాలు కోకొల్లలుగా ఉన్నాయని, వికసిత్ భారత్‌లో భాగంగా 2047 నాటికి తెలంగాణ రాష్ట్రం ఉద్యోగ ఉపాధి కల్పనలోదేశంలోనే అగ్రగామిగా నిలుస్తుందన్నారు. త్వరలో భారతదేశం ప్రపంచంలోనే 3వ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలుస్తుందన్నారు.

**డిగ్రీ విద్యార్థులకు శుభవార్త:** డిగ్రీ కళాశాలలో ప్రవేశం కొరకు వేచి చూస్తున్న విద్యార్థులకు శుభవార్తను అందించారు. ఇంజినీరింగ్ కౌన్సిలింగ్ ప్రక్రియ ముగిసిన తరువాత మరొక మారు డిగ్రీ కళాశాలలో ప్రవేశించడానికి అవకాశమిస్తామన్నారు. ఇప్పటి వరకు కళాశాలలో మొదటి సంవత్సరంలో ఎంత మంది విద్యార్థులు చేరారని అనే విషయాలను క్షుణ్ణంగా పరిశీలించి హర్షం వ్యక్తం చేశారు. అనంతరం కళాశాలలో అభివృద్ధి చేస్తున్న తెలంగాణ బొటానికల్ గార్డెన్‌కు స్వచ్ఛందంగా 25 వేల రూపాయలను విరాళంగా అందజేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వ్యక్తి గా జిల్లా అభివృద్ధిలో తాను పాలుపంచుకుంటానని, తన వంతుగా ఈ విరాళం ఇస్తున్నానని తెలిపారు. తెలంగాణ బొటానికల్ గార్డెన్ అభివృద్ధికి దాతలు సహకరించాలని, తద్వారా జీవవైవిధ్య పరిరక్షణకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఇలాంటి బొటానికల్ గార్డెన్ తెలంగాణ రాష్ట్రంలో మరెక్కడాలేదని మరి కొంత కష్టపడితే గిన్నిస్ బుక్‌లోకి ప్రవేశించే అవకాశం ఉందన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠాలు చెప్పడమే కాకుండా, గార్డెన్ అభివృద్ధికి కృషి చేస్తున్న డా. సదాశివయ్యను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ డా. డి నర్మద, అధ్యాపకులు శ్రీనివాసులు, రాఘవేందర్‌రెడ్డి, డా.సదాశివయ్య, సులేమాన్, దోస్త్ కన్వీనర్ సురయ జబీన్,నరసింహులు, నాగలక్ష్మి, వేణు, లెఫ్టినెంట్ రాజేశ్వరి, పుష్పలత, నరసింహారావు, వెంకటయ్య, ఆంజనేయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతు భరోసా అందరికీ అమలయ్యే విధంగా చూడాలి

### -మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్ రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 5 ప్రభాతవార్త:** ప్రజా ప్రభుత్వం, రైతు ప్రభుత్వమని చెప్పుకునే ప్రభుత్వంలో రైతులకు పూర్తి రుణ మాఫీ, రైతులందరికి రైతు భరోసా ఇవ్వకుండా రైతులను మోసం చేస్తుందని,రైతు భరోసా రైతులందరికీ అందే విధంగా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వందేనని కొల్లాపూర్ బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్ రెడ్డి జిల్లాకలెక్టర్‌ను కలిసి కొల్లాపూర్‌లోని పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కొల్లాపూర్ నియోజకవర్గంలో దాదాపు 2500 మంది రైతులకు రైతు భరోసా అందలేదని, ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్న అధికారులు రైతులకు అందించడం లేదని పేర్కొన్నారు.రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఆదుకోకపోతే టిఆర్ఎస్ పార్టీ తరుపున కలెక్టరేట్ కార్యాలయాన్ని, సబ్ స్టేషన్‌ను ముట్టడిస్తామని ఆయన అన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిలో కాలమవుతున్న రూ.2వేలు ఉన్న పెన్షన్లు రూ.4వేల రూపాయలు చేస్తానని చెప్పి పేద ప్రజలను మోసం చేస్తున్నారని, ఒక్కొక్క పెన్షన్ దారుడికి కాంగ్రెస్ ప్రభుత్వం గడిచిన ఏడాదిన్నర కాలంలో దాదాపు రూ.40వేలు బాకీ పడ్డారని, వెంటనే పెన్షన్లుపెంచి పేద ప్రజలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు భరోసా అందని రైతులకు న్యాయంచేసే విధంగా కృషి చేస్తానని, అదేవిధంగా ట్రాన్స్‌ఫార్మర్లు రైతులకు అందించే విధంగా సంబంధిత అధికారులు ఆదేశాలు జారీ చేస్తానని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## జర్నలిస్టులకు వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించాలి

■ బిజెపి జిల్లా అధికార ప్రతినిధి గజరాజుల తిరుమలేష్

**వనపర్తి, జూలై 5 ప్రభాతవార్త:** జర్నలిస్టులకు వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి గజరాజుల తిరుమలేష్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ప్రజాస్వామ్యంలో పత్రికా రంగం అనేది నాలుగో స్తంభం ఎక్కడ ఏ విధమైనటువంటి సమాచారం తెలుసుకోవాలన్న అది కేవలం ప్రింటింగ్, ఎలక్ట్రానిక్ మీడియా తోనే సాధ్యమవుతుంది ఈ సామాజిక సేవకు వారికి ఇప్పటివరకు ఎక్కడ కూడా తగిన గౌరవం లేదని ఈ సందర్భంగా తెలియజేస్తూ ఎటువంటి ఫలితాన్ని ఆశించకుండా జర్నలిస్టులు సేవ చేస్తున్నప్పటికీ ప్రభుత్వము నుండి ఇప్పటివరకు న్యాయం చేయలేదు. ప్రభుత్వం వెంటనే స్పందించి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను కేటాయించాలని, నూతన అక్రిడేషన్ కార్డులను ఇవ్వాలని, ప్రభుత్వం నుంచి మెడికల్ వైద్య సదుపాయాలు కల్పించాలని, వారి యొక్క కుటుంబ సామాజిక బాధ్యత గౌరవేతనం ఇవ్వాలని జర్నలిస్టుల సమస్యల కోసం భారతీయ జనతా పార్టీ అండగా ఉంటుందని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి గజరాజుల తిరుమలేష్ ఒక ప్రకటనలో కోరారు.

## జులై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

**దేవరకద్ర, జూలై5 ప్రభాతవార్త:** జులై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్రా బిక్షపతి మాదిగ అన్నారు. శనివారం కౌకుంట్ల మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జులై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని గ్రామ, గ్రామాన ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు మైలారం శ్రీరాములు మాదిగ, కౌకుంట్ల మండల ఎమ్మార్పిఎస్ నాయకులు బంటు రాజు మాదిగ, వంశీ, జీవన్, చందు, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్‌లో ఉన్న అప్లికేషన్లు అమలు చేయండి



**మాగనూర్,జూలై5 ప్రభాతవార్త:** పెండింగ్‌లో ఉన్న వికలాంగుల పెన్షన్ అప్లికేషన్లను అమలు చేయాలని ఎన్పిఆర్‌డి సంఘం నాయకులు రాష్ట్ర, జిల్లా కమిటీ పిలుపు మేరకు శనివారం మాగనూర్ తహసిల్దార్ నాగలక్ష్మికి వినతిపత్రం అందించారు. సంఘం నాయకులు పూంజనూర్ బాబు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 43 లక్షల మంది వికలాంగులు ఉన్నారని, ఇందులో 24 లక్షల మంది వికలాంగుల అప్లికేషన్లు పెండింగ్లో ఉంచడం బాధాకరమన్నారు. తక్షణమే పెండింగ్లో ఉన్న అప్లికేషన్లను అమలుపరిచి, వికలాంగుల కార్పొరేషన్ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు.ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చినటువంటి హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లలో వికలాంగులకు ఐదు శాతం వాటా కేటాయించాలని డిమాండ్ చేశారు. స్థానికసంస్థల్లో వికలాంగులకు ప్రాతినిథ్యం కల్పించాలని కోరారు. ఈయన వెంట సంఘం సభ్యులు వార్కుర్ రవి, లక్ష్మినారాయణ, లంగటి వాబయ్య, వర్కూర్ వెంకటప్పలు ఉన్నారు.

## ట్రిపుల్ ఐటిలో నర్వ విద్యార్థులకు సీటు

**నర్వ, జులై 5 ప్రభాతవార్త :** నర్వ మండలం ప్రతిభ ఉన్నత పాఠశాలలో చదివిన ఇద్దరు విద్యార్థులు ట్రిబుల్ ఐటిసీట్లు సాధించారని పాఠశాల కరస్పాండెంట్ టి.హన్మంత్ రెడ్డి శనివారం చెప్పారు. 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో మొదటి స్థానాల్లో నిలిచిన ఇద్దరు ట్రిబుల్ ఐటీ సీట్లు సాధించాలని తెలిపారు. సౌమ్య, అభినవ్‌గడిచిన పదవ తరగతి ఫలితాలలో టాప్ మార్కులు సాధించడంతో పాటు ఇప్పుడు సీట్స్ సాధించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా వీరిని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సిబ్బంది అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆకాంక్షించారు.

## వికలాంగుల పెండింగ్ పెన్షన్లు వెంటనే మంజూరు చేయాలి



వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**మద్దూర్, జూలై 5 ప్రభాతవార్త:** వికలాంగుల పెండింగ్ పెన్షన్లను వెంటనే మంజూరు చేయాలని నారాయణపేట జిల్లా వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షురాలు రాధమ్మ అన్నారు. శనివారం స్థానిక తహసిల్దార్ మహేష్ కుమార్‌గౌడ్‌కు మెమొరండం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వికలాంగులకు పెండింగ్‌లో ఉన్న పెన్షన్లను వెంటనే మంజూరు చేసి వారి బాగోగులను ప్రభుత్వం పట్టించుకోవాలని ఈ సందర్భంగా ఆమె అన్నారు.లక్షల మంది వికలాంగులు ఇప్పటివరకు దరఖాస్తు చేసుకున్నారని ఈ సందర్భంగా తాసిల్దార్‌కు ఆమె తెలియజేశారు. వీటిని వెంటనే ప్రభుత్వం మంజూరు చేయాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

### త్రిభువన్ సహకార యూనివర్సిటీ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న డిఎఫ్‌సిస్ చైర్మన్

**నారాయణపేట ప్రతినిధి, జూలై5 ప్రభాతవార్త:** త్రిభువన్ సహకార యూనివర్సిటీ భూమి పూజ శంకుస్థాపన కార్యక్రమం శనివారం ఉదయం 11 గం.లకు కేంద్ర హోం సహకార శాఖ మంత్రి అమిత్ షాచే గుజరాత్‌లో ఆనంద్ వ్యవసాయ విశ్వవిద్యాలయ మైదానంలో జరిగింది.కార్యక్రమనికి నేషనల్ ఫిషరీస్ డెవలప్మెంట్ బోర్డ్ సౌజన్యం తెలంగాణ రాష్ట్ర పశు సంవర్ధక,మత్స్య శాఖ,క్రీడల,యువజన సర్వీసుల మంత్రివర్యులు డా.వాకిటి శ్రీహరి నారాయణపేట ఎమ్మెల్యే డా.పర్ణికరెడ్డి సూచన మేరకు తెలంగాణ రాష్ట్ర మత్స్య శాఖ సంచాలకులు నిఖిల అదనపు సంచాలకులు డా.మురళీకృష్ణ,జిల్లామత్స్యశాఖ అధికారి రెహమాన్ సహకారంతో తెలంగాణ రాష్ట్రంతరపున నారాయణపేట జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షులు ఏ.కాంతకుమార్, పెద్దపల్లి జిల్లా మత్స్య శాఖ అధికారి నరేష్ కుమార్ నాయుడు, ఖమ్మం జిల్లా సహకార సంఘంసెక్రెటరీ యంగలరవికుమార్, హనుమకొండ జిల్లా కొండపర్తి గ్రామ మత్స్య శాఖ అధ్యక్షులు కుమారస్వామి పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న నేతలు

**నారాయణపేట ప్రతినిధి, జూలై 5 ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల శనివారం బిజెపి రాష్ట్ర నాయకులు నాగురావు నామాజీ ఆధ్వర్యంలో చెక్కులు లబ్ధిదారులకుఅందజేశారు.శివలీలకురూ.18000,మల్లేష్‌కు రూ.37,500, జమున రాణికి రూ.12000, దేవంద్రమ్మకి రూ.60,000 సంతోషమ్మకు రూ. 10500 విలువగల చెక్కులు అందుకున్నారు. కార్యక్రమంలో బిజెపి లీగల్ సెల్ కన్వీనర్ నందు నామాజీ, పట్టణ అధ్యక్షులు పోషల్ వినోద్, మిర్చి వెంకటయ్య, కమలాపురం శ్రీనివాస్,కోశాధ్యక్షులు బిల్డర్‌వెంకట్ రాములు తదితరులు పాల్గొన్నారు. సీఎం రిలీఫ్ అండ్ చెక్కుల సహకారంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్ని విధాలుగా సహాయ సహకారం అందించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు.

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడికి అభినందనల వెల్లువ



బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన బాలా త్రిపుర సుందరి, బ్రహ్మాచారి

**మహబూబ్‌నగర్, జూలై 5 ప్రభాతవార్త:** బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఎన్.రాంచందర్ రావును కలిసి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి బిజెపి నాయకులు పెద్ద ఎత్తున తరలి వెళ్లి ఆయనకు హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్ బాలాత్రిపుర సుందరి,బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీరబ్రహ్మాచారి, జిల్లా కార్యవర్గ సభ్యులు లోకిరేవ్ శ్రీనివాస్, జడ్చర్ల మండలఅధ్యక్షుడు రామకృష్ణ, నవాబ్‌పేట మండల అధ్యక్షుడు లక్ష్మినారాయణ,నవాబుపేట మండల ప్రధాన కార్యదర్శి గణేష్, నాయకులు రఘు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వర్గీకరణ ప్రకారం కుల ధ్రువీకరణ పత్రాలు అందజేయాలి

మాదిగ ఉద్యోగుల సమైక్య జాతీయ ఉపాధ్యక్షులు గద్వాల కృష్ణ మాదిగ

**వనపర్తి,జూలై5 ప్రభాతవార్త:** ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ ప్రకారం, తక్షణమే ఎస్సీలకు క్రొత్త కుల ధృవీకరణ పత్రాలు జారీ చేయాలనీ ఉద్యోగుల సమైక్య జాతీయ ఉపాధ్యక్షులు గద్వాల కృష్ణ విజ్ఞప్తి చేశారు. శనివారం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా ఎస్సీల్లోని 59 ఉపకులాలను మూడు గ్రూపులుగా విభజించి ఏప్రిల్ మాసంలో జీవో 33ను జారి చేసినప్పటికీ, నేటి వరకు కూడా ఎస్సీ వర్గీకరణ ప్రకారము,ఎస్సీలోని 59 ఉప కులాలకు మూడు గ్రూపులుగా, క్రొత్త కుల దృవీకరణ పత్రాలను జారీ చేయడంలో అలసత్వంప్రదర్శించడాన్ని నిరసిస్తూ, తక్షణమే ఎస్సీల్లోని మూడు గ్రూపుల ప్రకారం ఆయా కులాలకు క్రొత్త కుల ధృవీకరణ పత్రాలు జారీ చేయాలని కోరారు. ఎస్సీ అభ్యర్థులకు నూతన కుల ధృవీకరణ పత్రాలను జారీ చేయుటకు, వనపర్తి జిల్లాలోని 15 మండలాలకు సంబంధించిన తహసిల్దార్‌కు ఆదేశాలు జారీ చేయాలని వనపర్తి జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) బి.వెంకటేశ్వర్లుతో చర్చించి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బొరెల్లి వెంకటయ్య, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షులు తగుల సివిల్ కుమార్, ఎం.ఈఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, గంధందాసు ఎంఈఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాదిగ ఉద్యోగ సమైక్య నాయకులు

# విద్యార్థులకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలి

◆ఎస్సీ,బీసీ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి ◆ఇటిక్యాల, శాంతినగర్ గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు

**ఇటిక్యాల, జూలై 5 ప్రభాతవార్త :** జిల్లాలో గల ఎస్సీ, బీసీ ఎస్టీ మైనార్టీ గురుకుల పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అలాగే గురుకులాలలో అన్ని రకాల వసతులు విద్యార్థులకు కల్పించేలా గురుకుల పాఠశాలల ప్రిన్సిపల్స్ చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు సూచించారు. శనివారం ఇటిక్యాల మండలంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర కళాశాల. వడ్డేపల్లి మండలం శాంతినగర్‌లోని మహాత్మా జ్యోతిభా పూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులకు అందుతున్న విద్యా ప్రమాణాలు, వసతుల స్థితిగతులపై క్షేత్ర స్థాయిలో తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ,ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యతోపాటు అన్ని మౌలిక వసతులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. విద్యార్థుల భద్రత, పరిశుభ్రత, ఆరోగ్యం, అభ్యాస వాతావరణంపై ఎలాంటి రాజీ లేకుండా పాఠశాల యాజమాన్యం నిష్ఠతో వ్యవహరించాలని సూచించారు. ప్రతి తరగతిలో విద్యార్థులకు పాఠాలు స్పష్టంగా అర్థమయ్యేలా బోధించడంపై దృష్టి పెట్టాలని అన్నారు. భోజనం నాణ్యత విషయంలో ఎలాంటి రాజీకి అవకాశం లేకుండా, ప్రతిరోజూ మెనూ ప్రకారం పౌష్టిక విలువలతో కూడిన ఆహారం అందించాలని అన్నారు. విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలు, సృజనాత్మక కార్యకలాపాల్లో విద్యార్థులను ప్రోత్సహించాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. పాఠశాల పరిసరాల పరిశుభ్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.విద్యార్థులకు శుభ్రత పట్ల అవగాహన కల్పించే విధంగా ఉపాధ్యాయులు చొరవ చూపాలని తెలిపారు. విద్యార్థులతో తరచూ ముఖాముఖి సంభాషణ జరిపి వారి సమస్యలు తెలుసుకోవాలని, వారిని ప్రోత్సహించేలా ఉపాధ్యాయులు ముందుండాలని సూచించారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడిన అదనపు కలెక్టర్, అందుతున్న వసతులపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. విద్యార్థులు నిరంతరం కృషి చేసి ఉత్తమ విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. మీ భవిష్యత్తు నిర్మాణానికి కావాల్సిన అన్ని సదుపాయాలను ప్రభుత్వం పూర్తిగా కల్పిస్తుందని విద్యార్థులకు తెలిపారు. ఈ తనిఖీల సందర్భంగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు,సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.



గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వండిన కూరలను పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు

# టీయూడబ్ల్యూజే ఐజేయు ఆధ్వర్యంలో వెంకట్‌గౌడ్‌కు సన్మానం



వెంకట్‌గౌడ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**వనపర్తి, జూలై 5 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా కేంద్రంలో శనివారం నాడు టియుడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర కార్యదర్శి జి.మధుగౌడ్ ఆధ్వర్యంలో జిల్లా పరిధిలో పనిచేస్తున్న ఎలక్ట్రానిక్ మీడియా, ప్రింట్ మీడియా సమక్షంలో సీనియర్ రిపోర్టర్ కె.వెంకట్ గౌడ్‌కు జిల్లాలో నూతనంగా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా ఎంపికైన సందర్భంలో టీయూడబ్ల్యూజే (ఐజేయు) వేదికగా సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి జి.మధు గౌడ్ అందరి సమక్షంలో సన్మానించి వారు మాట్లాడారు. సామాజిక స్పృహతో ఎప్పుడు ప్రజల కోసం తన ఆలోచన విధానంలో నిరంతరం పత్రిక రంగంలో కూడ తన సేవలను అందిస్తూ గతంలో కూడ జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులుగా ఉంటూ పత్రికా రంగానికి నిజమైన జర్నలిస్టులకు జిల్లా కలెక్టర్‌తో అక్రిడేషన్ కార్డులను ఇప్పించుటకు తన బాధ్యతలను నిర్వహించిన వ్యక్తి అందరిలో మంచితనంతో కలుపుకుపోయే గుణం ఉన్న మంచి వ్యక్తిని కొనియాడారు. వనపర్తి జిల్లా ప్రజల కోసం తనకు ఇచ్చిన బాధ్యతను న్యాయం చేయుటకు తమ వంతు సహకారాన్ని కూడ అందించాలని అందరిని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ మాధవరావు, కో కన్వీనర్ రాజు, సీనియర్ రిపోర్టర్స్ మల్యాల బాలస్వామి, ఉషన్న, పౌర్ణరెడ్డి, ఆంధ్రజ్యోతి వనపర్తి ఇన్చార్జి ఎం.భాస్కర్ యాదవ్, ప్రజాతంత్ర స్టాఫ్ రిపోర్టర్ నాకొండ యాదవ్, వార్త స్టాఫ్ రిపోర్టర్ బెక్కెరి విజయ్, వనపర్తి పట్టణ ప్రధాన కార్యదర్శి ద్వారపోగు మన్యం, ప్రజాజ్యోతి స్టాఫ్ రిపోర్టర్ తైలం అరుణ్‌రాజ్, ఎన్టీవీ వనపర్తి ఇంచార్జ్ చీర్ల ఆంజనేయులు సాగర్, 99 న్యూస్ ఛానల్ స్టాఫ్ రిపోర్టర్ నరసింహ, రాజు, బిగ్ టీవీ అరుణ్ కుమార్, మన తెలంగాణ రిపోర్టర్ తిరుపతయ్య, రాజేంద్రప్రసాద్ యూనియన్ నాయకులు, సాక్షి శ్రీనివాసులు, కృష్ణయ్య, నటరాజ్, రాజేంద్రప్రసాద్, రవికాంత్, శివ ప్రసాద్, శివకుమార్, దాచా హరీష్ కుమార్, వేణుగోపాల్, కమల్, మహేష్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## అదనపు కలెక్టర్‌కు వినతి

**వనపర్తి,జూలై5 ప్రభాతవార్త:** ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ ప్రకారం, తక్షణమే ఎస్సీలకు క్రొత్త కుల ధృవీకరణ పత్రాలు జారీ చేయాలనీ ఉద్యోగుల సమైక్య జాతీయ ఉపాధ్యక్షులు గద్వాల కృష్ణ విజ్ఞప్తి చేశారు. శనివారం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వము ప్రతిష్టా త్మకంగా ఎస్సీల్లోని 59 ఉపకులాలను మూడు గ్రూపులుగా విభ జించి ఏప్రిల్ మాసంలో జీవో 33ను జారి చేసినప్పటికీ, నేటి వరకు కూడా ఎస్సీ వర్గీకరణ ప్రకారము,ఎస్సీలోని 59 ఉప కులా లకు మూడు గ్రూపులుగా, క్రొత్త కుల ధృవీకరణ పత్రాలను జారీ చేయడంలో అలసత్వంప్రదర్శించడాన్ని నిరసిస్తూ, తక్షణమే ఎస్సీల్లోని మూడు గ్రూపుల ప్రకారం ఆయా కులాలకు క్రొత్త కుల ధృవీకరణ పత్రాలు జారీ చేయాలని కోరారు. ఎస్సీ అభ్యర్థులకు నూతన కుల ధృవీకరణ పత్రాలను జారీ చేయుటకు, వనపర్తి జిల్లాలోని 15 మండలాలకు సంబంధించిన తహసిల్దార్‌కు ఆదే శాలు జారీ చేయాలని వనపర్తి జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) బి.వెంకటేశ్వర్లుతో చర్చించి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బొర్రెల్లి వెంకటయ్య, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షులు తగుల సివిల్ కుమార్, ఎం.ఈఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, గంధందాసు ఎంఈఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ పాల్గొన్నారు.

## ఆరోగ్య ప్రధాయినీ అల్లనేరేడు

◆సకల రోగ నివారిణి ◆తింటే రోగాలు మాయం

◆కిలో రూపాయలు రెండు వందల నుంచి 250 వరకు పలుకుతున్న ధర



**దేవరకద్ర, జూలై 5 ప్రభాతవార్త:** వేసే కాలం వెళ్లి వర్షాకాలం వచ్చేసింది. ఈ సీజన్‌లో లభించే పండ్లలో నేరేడు పండ్లు ఒకటి. మార్కెట్ లో ఇప్పుడు ఎక్కడ చూసినా వీటిని తోపుడు బండ్లపై విరివిగా విక్రయిస్తున్నారు. పావుకేజీ రూపాయల 50 నుండి 60 వరకు విక్రయిస్తున్నారు. వ్యాపారులు దేవరకద్ర, కౌకుంట్ల, మండలాలో ఆయా కాలనీలోకి బండ్లపై వచ్చి అమ్ముతున్నారు. నేరేడు పండ్లను సకల రోగా నివారిణిగా చెబుతారు. వీటిలో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చెరువు గట్లు, రాహదుల వేబడి ఎక్కడ చూసినా ఈ చెట్లు కనిపిస్తాయి. పట్టణ ప్రాంతాల్లో పేరట్లో కూడా ఈ చెట్లను పెంచుతారు. పెరట్లో ఈ చెట్లకు కాయలు గుత్తులు గుత్తులుగా కనువిందు చేస్తుంటాయి. నేరేడు పండ్లు కొందరికి జీవనోపాధిగా ఉపయోగపడుతుంది.

**తింటే రోగాలు మాయం:** కడుపులో ఎంతో కాలం నుంచి పేరుకుపోయిన మలినాలను బయటకు వెళ్లడానికి నేరేడు పండు దోహదపడతాయి. పేగుల్లో చుట్టుకుపోయిన వెంట్రుకలను కోసేసి బయటకు పంపే శక్తి పెరుగుతుంది. మూత్ర సంబంధమైన సమస్యలపై కూడా నేరేడు బాగా పనిచేస్తుంది. నీరసం నిసత్తువ ఉన్నవారు వీటిని తినడం వల్ల తక్షణ శక్తి కలుగుతుంది. వెన్నునొప్పి, నడుం నొప్పి, మోకాళ్ళ నొప్పులు కూడా తగ్గుతాయి. జిగట విరోచనాలతో బాధపడేవారు నేరేడు పండ్ల రసాన్ని రెండు నుంచి మూడు చెంచాల చొప్పున తీసుకోవాలి. వీటిలో ఉండే యాంటీ యాక్సిడెంట్లు మెదడుకు గుండెకు బాగా పనిచేస్తాయి. జ్వరంగా ఉన్నవారు ధనియాల రసంతో నేరేడు రసం కలిపి తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది. మూత్రం మంట తగ్గడానికి నిమ్మరసం నేరేడు రసం రెండు చెంచాలు నీటిలో కలిపి తీసుకోవాలి. అధిక బరువు ఉన్నవారు మధుమేహంతో ఇబ్బంది పడేవారు సైతం వీటిని రోజుకు 6 నుంచి 8 పండ్ల వరకు తినవచ్చని వైద్యులు చెప్తున్నారు. గర్భిణీలు మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ నేరేడు పండ్లు తినరాదని చెప్తున్నారు. నేరేడు పండ్లు అరగడానికి ఎక్కువ సమయం పడుతుంది. భోజనం చేసిన గంట తర్వాత పండ్లు తింటే ఆహారం త్వరగా జీర్ణం అవుతుంది. అధికంగా తింటే మలబద్ధకం సమస్యతో పాటు నోటిలో వేగటుగా ఉంటుంది. తగు మాత్రం తీసుకుంటే మంచి ఫలితం ఉంటుందని ఆయుర్వేద వైద్యులు సూచిస్తున్నారు.

## ఏకలవ్యను సందర్శించిన అదనపు కలెక్టర్

**వెల్దండ, జూలై 05 ప్రభాతవార్త:** మండలంలోని గుండాల ఏకలవ్య మాడల్ రెసిడెన్షియల్ పాఠశాలను నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ అమరేందర్ ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాల గదులను పరిశీలించడంతో పాటు విద్యార్థులతో మాట్లాడి హాజరు పట్టికను పరిశీలించారు. పాఠశాలలో ఉన్న సమస్యలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుండి ఇక్కడికి వచ్చిన విద్యార్థులకు సరైన రీతుల విద్యాబోధన చేయాలని, మెనూ ప్రకారం నాణ్యతమైన భోజనం అందించాలని, విద్యార్థులకు చదువులతో పాటు క్రీడలో రాణించే విధంగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కోడం భాస్కర్, ఉపాధ్యాయులు రీనా, అనిషా, కీర్తి, రాహుల్, పర్వీన్, ఇమాందిన్, మల్లికాతో పాటు తదితరులున్నారు.



# మతసామరస్యానికి ప్రతీక పీర్లపండుగ

-త్యాగాలకు నిదర్శనంగా ఏటా జరిపే పదిరోజుల ఉత్సవం

-తెలంగాణ సాంప్రదాయ పండుగలలో పీర్లపండుగకో ప్రత్యేకత

-సంతాప దినాలుగా పరిగణిస్తున్న కొన్ని తెగల ముస్లీంలు

-డప్పుల మోతలు..అసయ్ దులా కోలాటాలు..

-అలావా ఆటలు..పీరీల పంజాల ఊరేగింపులు

**భూత్పూర్,జూలై 5,ప్రభాతవార్త:** తెలంగాణలో కుల,మతాలకతీతంగా అన్ని వర్గాలు జరిపే ఏకైక ఉత్సవం మొహర్రం.ముస్లింలు జరిపే అతి పెద్ద పండుగలలో మొహర్రం ఒకటి. దీన్నే తెలంగాణలో పీర్ల పండుగ అని అంటారు.మొహర్రంను ముస్లింలు ఇస్లామిక్ క్యాలెండర్‌లో మొదటి నెలగా భావిస్తారు.మొహ్మద్ ప్రవక్త మనవడైన ఇమామ్ హుస్సేన్ కర్బలా మైదానంలో వీరోచితంగా పోరాడి క్రీస్తు శకం 680లో ప్రాణాలు విడిచాడట.ఇమామ్ హుస్సేన్‌తో పాటు అతడి అనుచరులు కర్బలా మైదానంలో ప్రాణాల్ని కోల్పోయారట.మొహర్రంను సియా ముస్లింలు ఆషురా పేరుతో 10వ మొహర్రంను అమరులైన ఇమామ్ హుస్సేన్ అతని అనుచరులు 63మంది కర్బలా మైదానంలో ప్రాణాలు విడిచిన నేపథ్యంలో వీరి వీరోచిత పోరాటాలను ప్రజల్లో తెలియజేసేందుకు ముస్లింలుపీరీలను పంజాల రూపంలో మసీదులు(ఆషుర్‌ఖానా)లో పదిరోజుల పాటు ఉత్సవాలను నిర్వహిస్తారు.ఇస్లాం క్యాలెండర్ ప్రకారం మొదటి నెల నెలవంక కన్పించిన మూడో రోజుల నుంచి ఆషుర్‌ఖానా(మసీదు)లలో పంజా రూపాలలో ఉన్న పీరీలను ప్రతిష్టించి ఆరో రోజునుంచి ఒక్కొక్క పంజా(పీరీ)లను సవారీ ఘోడా ద్వారా పురవీధుల్లో ఊరేగిస్తూ పది రోజులూ సంతాప దినాలు పరిగణిస్తూ కర్బలా మైదానంలో ప్రాణాలను కోల్పోయిన ఇమామ్ హుస్సేన్ ఇతర అనుచరులను జ్ఞాపకం చేసుకుంటూ గుండెలు బాదుకుంటూ ముస్లింలు పీరీలను ఊరేగిస్తారు.గ్రామాల్లో అన్ని వర్గాలప్రజలు పీర్ల పండుగను ఎంతో ఘనంగా నిర్వహిస్తారు.కొన్ని ప్రాంతాలలో హిందూవులే ప్రధాన పూజారులుగా ఉంటూ,సవారీలు ఎత్తుతూ పీరీలను ఆడిస్తూ ఊరేగింపు నిర్వహిస్తారు.ఇక తెలంగాణ పల్లెల్లో పీరీలను ప్రతిష్టించిన మసీదుల ముంగిట అలావాలు తవ్వి,చితిమంటలు వెలిగిస్తూ అలావా ఆడుతుంటారు.అసైదులా హారతి..కాళ్ల గజ్జెల గమ్మతి..ఒకటే పీరు తొర్రి మసీదు..దుంకుతచూడు అలావాలో..అంటూ ఎగురుతూ, దుముకుతూ కాళ్లకుగజ్జెలు కట్టి ఆడుతుంటారు.గ్రామీణ మహిళలు సైతం అలావా చుట్టూ బొడ్డెమ్మలాడుతూ ఏమేమి కావలి సామికి. .ఎనుగొండ మొగులాలికి అంటూ అలావా చుట్లూ బొడ్డెమ్మలాడూ ,పాడుతూ గీతాలాపనలు చేస్తుంటారు.మొహర్రం పదిరోజు గ్రామాల్లో చిన్నా,పెద్దా అనే తేడా లేకుండా పీర్ల పండుగను పండగ వాతావరణంలో జరపుతారు.

పదో రోజు పంజాలను బావుల వద్దకు తీసుకెళ్లి పంజాలను కడిగి తిరిగి పెట్టెలలో భద్రపరు స్తారు.ఇక కొన్ని పట్టణాలలో షియా ముస్లిం యువకులు గుండెలు బాదుకుంటూ,రక్తాల్ని చిందిస్తూ పీరీల ఊరేగింపు నిర్వహిస్తారు. మొత్తం మీద పీర్ల పండుగ తెలంగాణలో కులమతాలకు అతీతంగా అందరూ సమిష్టిగా జరిపే గొప్ప పండుగని చెప్పకతప్పదు.

# ఈవీఎంలు భద్రపరిచిన గోదాములకు కట్టుదిట్టమైన భద్రత

## వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి, జూలై 5 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని ఈవీఎంలు భద్రపరిచిన గోదాము కట్టుదిట్టమైన భద్రత నడుమ ఉందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. శనివారం ఆర్డీవో కార్యాలయం వెనక ఉన్న ఈవీఎం, వీవీప్యాట్ గోదామును నెలవారీ తనిఖీల్లో భాగంగా జిల్లాకలెక్టర్, ఆర్డీవో సుబ్రహ్మణ్యంతో కలిసి పరిశీలించారు. ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా గోదాం వద్ద భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేశారు. సీసీ కెమెరాల భద్రతా వ్యవస్థను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు ఈవీఎం, వీవీ ప్యాట్ గోదామును తనిఖీ చేసి సమగ్ర నివేదికను సమర్పిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో శనివారం నెలవారి తనిఖీలు చేసినట్లు వివిధ రాజకీయ వివరించారు. తహసిల్దార్ రమేష్ రెడ్డి, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.



ఈవీఎం గోదామును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

# పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి : డీఎస్పీ

**ఊట్కూర్, జూలై5 ప్రభాతవార్త :** మొహరం పండుగ సందర్భంగా ఉట్కూర్‌లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేయడం జరిగిందని డీఎస్పీ నల్లపు లింగయ్య తెలిపారు. మొహరం పండుగకు నారాయణపేట జిల్లా ఫోర్స్‌తో పాటు ఉమ్మడి జిల్లా నుండివచ్చిన మొత్తం100 మంది పోలీస్ అధికా రులు, సిబ్బందికి ఉట్కూర్‌లోని రైతు వేదికలో బందో బస్తుకు వచ్చిన పోలీసులకు డిఎస్పీ నల్లపు లింగయ్య భద్రతాపరమైన సూచనలు ఇవ్వడం జరిగింది. ఉట్కూర్ టౌన్‌లో బందో బస్తును మూడు సెక్టార్లుగావిభజించి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయడం జరిగిందని బందోబస్తులో ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బంది సంయమనం పాటించాలని, ఎవరికి ఎక్కడ కేటాయించిన స్థలంలోవారు అక్కడే ఉంటూ విధులు నిర్వర్తించాలని సూచించారు. పిర్ల చావడి, మజీద్‌ల దగ్గర, ప్రధాన చౌరస్తాలో పోలీస్ పికెట్స్, పీర్ల ఊరేగింపు సమయంలో ట్రాఫిక్ డైవర్షన్, మొబైల్ పెట్రోలింగ్,ఫుట్ పెట్రోలింగ్ మొదలగు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది అనితెలిపారు.భక్తులరద్దీ ఎక్కువగా ఉన్నందున దొంగతనాలు జరగకుండా, ఆకతాయి నుండి మహిళల రక్షణ గురించి మఫ్టిలో పోలీసులను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.ప్రజలంతా కులమతాల కతీతంగా ఉత్సాహంగా పండుగ శాంతియుతంగా జరు పుకోవాలని, ప్రజలు పోలీసు వారికి సహకరించాలని డీఎస్పీ విజ్ఞప్తి చేశారు.అలాగే సోషల్ మీడియా పై (ఫేస్‌బుక్,వాట్సప్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్) పూర్తి నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని ఇతరులకు ఇబ్బందులు కలిగే విధంగా ఎలాంటి అనుచిత పోస్టులు వైరల్ చేయరాదని తెలిపారు. ప్రజలు అత్యవసర సమయంలో డయల్ 100కి కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలి పారు. ఈ కార్యక్రమంలో సిఐ రామ్ లాల్, ఎస్సైలు రమేష్, శివశంకర్, మద్దయ్య, రేవతి, గాయత్రి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ధ్యానంతో మానసిక ప్రశాంతత

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై5 ప్రభాతవార్త:** ధ్యానంతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పాలమూరు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. పాలమూరు యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ ఎల్, కన్హాశాంతి వనం ఇన్స్టిట్యూట్ సంయుక్తంగా మూడు రోజుల హార్ట్ ఫుల్ నెస్ మెడిటేషన్ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ బోధన,బోధనేతర ఆరోగ్యంగా ఉండాలని, ధ్యా నం, యోగా ద్వారా మానసిక ఒత్తిడి జయించవచ్చునని, మానసిక ప్రశాంతత కోసం ధ్యానం అవసరం అని, క్రమం తప్పకుండ ధ్యానం, యోగా అభ్యసనం చెయ్యాలని అన్నారు. ముఖ్య వక్త కృష్ణారావు మాట్లాడుతూ హృదయాన్ని శుద్ధి చేసుకోవాలని, కోరికలు లేకుండా ఆధ్యాత్మిక శూన్య హృదయం ఉన్నప్పుడు భగవంతుడు మన ప్రార్థన ఆలకిస్తాడని, నిస్వార్థంగా, సమాజ హితం కోసం యువత పాటుపడాలని, ధ్యానంను నిత్యకృత్యంగాచేస్తే భగవంతుని సేవలోనిమగ్నం అవుతామని అన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ డా.చంద్రకిరణ్, ప్రోగ్రామ్ అధికారులు, హార్ట్ ఫుల్ ఫౌండేషన్ ప్రతినిధులు రామ్‌రెడ్డి, మోహన్ పాల్గొన్నారు.

## గురుకులాల్లో విద్యా ప్రమాణాలు పెంచాలి



గురుకుల సంక్షేమ పాఠశాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

(మొదటి పేజీ తరువాయి)

పరిసరాలు, విద్యార్థినిల వసతులను కలెక్టర్ పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వ, తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా భవిష్యత్తులో ఉన్నత స్థానాల్లో రాణించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట తహసీల్దార్ మునిరొద్దీన్, ఎంపీడీవో కథలప్ప, ఎంపీఓ మహేష్ నాయక్, గురుకుల ప్రిన్సిపల్ సుమతి, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## గ్రౌండింగ్ ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

ఇసుక పొందడానికి అవగాహన కల్పించాలన్నారు. మన ఇసుక వాహనం ద్వారా ఇసుక అందించే విషయంపై సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని మైనింగ్‌శాఖ సూచించారు. సమావేశంలో హౌసింగ్ అధికారులు విఠోబా, ఏఈలు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 5 ఎంవిఏ సామర్థ్యం గల పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



**శ్రీరంగాపూర్, జూలై 5 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ యందు గల 3 ఎంవిఏ సామర్థ్యం గల పవర్‌ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి దాని స్థానంలో అధిక సామర్థ్యం గల 5 ఎంవిఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. దీనివలన శ్రీరంగాపురం, నగరాల ఒకటవ సెంటర్, నగరాల మూడవ సెంటర్, కంబాలపురం, కంబలపురం తాండ, షేర్ పల్లిలో,లో వోల్టేజి విద్యుత్ సమస్య లేకుండా ముందు జాగ్రత్తగా నాణ్యమైన విద్యుత్తును వినియోగదారులకు అందించడానికి 5 ఎంవిఏ పవర్ ట్రాన్స్‌ఫార్మరర్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ఈ, ఏఈ, ఏడి ఈడిఈ విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## సన్నిధి ఆశ్రమంలో అన్నదానం



ఆశ్రమంలో విద్యార్థులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

**మహబూబ్‌నగర్, జూలై 5 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ నగర పాలక సంస్థ పరిధిలోని వార్డు నెంబర్ 5కు చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు బి.అజయ్ కుమార్ వారి తండ్రి కీ॥శే॥ ధన్ పాల్ (సూపరింటెండెంట్ డిఎంహెచ్ఓ ఆఫీస్) జయంతిని పురస్కరించుకుని రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ పట్టణంలోని ఏనుగొండలో నిర్వహిస్తున్న సన్నిధి అనాదాశ్రమంలో చిన్నారులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జయంతిలను, వర్ధంతిలను పురస్కరించుకుని విరివిరిగాపట్టణంలోని ప్రముఖులు సన్నిధి ఆశ్రమంలో చిన్నారులతో జరుపుకోవాలని ఆయన సూచించారు. అవకాశం ఉన్నవారు అనాదాశ్రమంలో ఉన్న పిల్లలను దత్తత తీసుకొని, వారి అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు. అనంతరం చిన్నారులతో కలిసి ఆయన భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో వడ్డే శివకుమార్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రజక సంఘం నూతన కమిటీకి ఘన సన్మానం



రజక సంఘం నాయకులను సన్మానిస్తున్న సంఘ సభ్యులు

**వనపర్తి రూరల్, జూలై 5 ప్రభాతవార్త :** వనపర్తి పట్టణంలో శనివారం నాడు రజక కమిటీ హాల్ కమల నగర్‌లో రజక సంఘం సభ్యులు సమావేశంనిర్వహించారు.అందులో భాగంగా నూతనంగా ఎన్నికైన వనపర్తి జిల్లా రజక సంఘం నూతన అధ్యక్షులు ఇటిక్యాల బండలయ్యను, వనపర్తి పట్టణ రజక జనసేవ సంఘం నూతన అధ్యక్షులుగా కరట శేఖర్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనఅధ్యక్షులను శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం నూతన కమిటీ లు జిల్లా గౌరవ అధ్యక్షులు ఆంజనేయులు, పవన్, గౌరవాధ్యక్షులు బాలస్వామి, పోలీస్ వెంకటస్వామి సంఘంసభ్యులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలోరజక సంఘం సభ్యులు పాలకొండ సత్య నారాయణ,శ్యామ్, వెంకటయ్య, భీముడు,వజ్రాల రమేష్, శ్రీనివాసులు,రవి, సలేష్, పరశురాం,గణేష్ మహేష్ ,అంజి, శ్రీను, నరసింహ,రాము,అంజి,బాలస్వామి,గోవర్ధన్,చందు పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటిలో విద్యార్థులకు సీటు

**నర్వ, జులై 5 ప్రభాతవార్త :** నర్వ మండలం ప్రతిభ ఉన్నత పాఠశాలలో చదివిన ఇద్దరు విద్యార్థులు ట్రిబుల్ ఐటిసీట్లు సాధించారని పాఠశాల కరస్పాండెంట్ టి.హన్మంత్ రెడ్డి శనివారం చెప్పారు.10వ తరగతి పరీక్ష ఫలితాల్లో మొదటి స్థానాల్లో నిలిచిన ఇద్దరు ట్రిబుల్ ఐటీ సీట్లు సాధించాలని తెలిపారు. సౌమ్య, అభినవ్‌గడిచిన పదవ తరగతి ఫలితాలలో టాప్ మార్కులు సాధించడంతో పాటు ఇప్పుడు సీట్స్ సాధిం చడం జరిగిందని తెలిపారు.ఈ సందర్భంగా వీరిని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సిబ్బంది అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు చేరుకో వాలని ఆకాంక్షించారు.